సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం | 2 | జూన్ | 2024

అప్రకటిత కర్ఫ్యూ

భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం 10 దాటితే చాలు గడప దాటేందుకు జనం జంకుతున్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ నుంచి వినాయక్ చౌక్ వెళ్లే ప్రధాన రహదారి శనివారం మధ్యాహ్నం ఇలా నిర్మానుష్యంగా కనిపించింది.
–సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పుస్తకాల విక్రయానికి దరఖాస్తు చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: 2024–25 విద్యా సంవత్సరంలో పాఠ్య పుస్తకాల విక్రయానికి ఆసక్తి గల దుకాణాదారులు ఈనెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. పుస్తక విక్రయాల కోసం అనుభవం, వ్యాట్ లైసెన్స్, టర్నోవర్ టాక్స్, ఆడిట్ రిపోర్టు, జీఎస్టీ పత్రాలతో పాటు రూ.3 వేల డీడీ జతచేసి డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

'బడి బస్సు' నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: స్కూల్ బస్సుల యాజమాన్యాలు నిబంధనలు తప్పనిసరి పాటించాలని జిల్లా రవాణశాఖాధికారి శివపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలతో స్కూల్ బస్సుల నిబంధనలపై శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు కండిషన్‌లో ఉండాలన్నారు. ఇప్పటికే గడువు ముగిసినందున ప్రతీ బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించాలన్నారు. ధ్రువీకరణ ప త్రాలు లేకుండా బస్సులను నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు ఇబ్బ ందులు కలుగకుండా బస్సుల్లో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంవీఐ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 27,936 'డిమాండ్' విత్తన ప్యాకెట్లు

• కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: జిల్లాకు 27,936 డిమాండ్ రకం(రాశీ) విత్తన ప్యాకెట్లు వచ్చాయని, వాటిని ఆదివారం ఉదయం 7గంటల నుంచి రైతులకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. పత్తి విత్తనాలకు సంబంధించి జిల్లాలోని తహసీల్దార్లు, ఏవోలు, ఏఈవోలతో శనివారం రాత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోనే కాకుండా మండలాల్లోని క్లస్టర్ల వారీగా విత్తన షాపుల్లో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వానాకాలం పంటల ప్రణాళికకు అనుగుణంగా 4 లక్షల 16 వేల ఎకరాలకు సరిపడా పత్తి, ఇతర రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విడతల వారీగా సరఫరా చేస్తున్న డిమాండ్ రకం విత్తన ప్యాకెట్లు నేటి నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామాలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, డీఏవో పుల్లయ్య, ఏడీఏ రమేశ్ పాల్గొన్నారు.

12 నుంచి 'విద్యుత్ గ్రీవెన్స్'

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 12 నుంచి ప్రతీ బుధవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందని, వినియోగదారులు ఏమైనా సమస్యలుంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రగతి బాట..



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, డివైడర్లు

• జిల్లాతో పాటు మండలాలు, గ్రామాల పునర్విభజన
• పెరిగిన సాగు విస్తీర్ణం
• మెరుగైన వైద్య సదుపాయాలు
• పట్టణ రహదారులకు న్యూ లుక్
• పదేళ్లలో మారిన జిల్లా స్వరూపం

సాక్షి,ఆదిలాబాద్: రాష్ట్ర ఆవిర్భావానికి ముందున్న పరిస్థితుల నుంచి ఈ పదేళ్లలో జిల్లాలో అనేక మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి. తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున పాల్గొన్న ప్రజలు స్వరాష్ట్రంలో తమ ప్రాంత అభివృద్ధిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. దానికి తగ్గట్లే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాయి. అయితే నాణానికి మరో వైపు అభివృద్ధికి నోచుకోని పరిస్థితి కూడా ఉంది.

నాలుగు జిల్లాలుగా ఏర్పాటు..
రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 అక్టోబర్‌లో పాలన సౌలభ్యం దృష్ట్యా జిల్లాల పునర్విభజన చోటు చేసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ నాలుగు జిల్లాలుగా విడిపోయింది. కొత్తగా మంచిర్యాల, నిర్మల్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలుగా ఏర్పడ్డాయి. 13 మండలాలతో ఏర్పడ్డ ఆదిలాబాద్‌లో మరో ఐదు కొత్త మండలాలు మావల, ఆదిలాబాద్‌అర్బన్, భీంపూర్, సిరికొండ, గాదిగూడ చేరాయి. దీంతో ఈ సంఖ్య 18కి చేరింది. అలాగే 243 గ్రామ పంచాయతీల నుంచి అదనంగా మరో 227 నూతన పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఇలా అనేక మార్పులు చేర్పులు చోటు చేసుకున్నాయి.

పెరిగిన సాగు విస్తీర్ణం..



జిల్లాలో సాగవుతున్న పత్తి (ఫైల్)

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటికి జిల్లాలో 4 లక్షల 88 వేల 925 ఎకరాలు సాగు విస్తీర్ణం ఉండగా ప్ర స్తుతం అది 5 లక్షల 79వేల ఎకరాలకు పెరి గింది. పత్తి, సోయా, కంది, మినుము, పెసర, వరి, గోధుమ, జొన్న తదితర పంటలను జిల్లా రైతులు సాగు చేస్తున్నారు. అయితే ప్రధాన పంట మాత్రం పత్తే. మొత్తం సాగు విస్తీర్ణంలో ఇది 70 శాతానికి పైగా ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే జిల్లాలో రైతులు 90 శాతం వర్షాధారంగానే పంటలు పండిస్తున్నారు.


జిల్లా కేంద్రానికి న్యూలుక్..

పూర్వఆదిలాబాద్‌కు జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం అంతంతగానే ఉండేది. స్వరాష్ట్రం, కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత ఆదిలాబాద్ పట్టణ రూపురేఖలు మారిపోయాయి. పట్టణ ప్రధాన రహదారి పరిధిలో కిలోమీటర్ల మేర డివైడర్ల ఏర్పాట్లు, సెంట్రల్ లైటింగ్ వచ్చేశాయి. ఆయా రోడ్ల నిర్మాణాలతో పాటు ఎనిమిది కూడళ్లను ఏర్పాటు చేశారు. సమీకృత మార్కెట్ నిర్మాణంతో పాటు ఇండోర్ స్టేడియంకు కొత్త భవన నిర్మాణం సాగుతోంది. పార్కులలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. మొత్తంగా జిల్లా కేంద్రానికి స్వరాష్ట్రంలో న్యూ లుక్ వచ్చినట్లయింది.



తెలంగాణ జంక్షన్‌లో వాటర్ ఫౌంటెన్

ప్రాజెక్టుల తీరిది..



కొరటా- చనాఖా బ్యారేజ్

జిల్లాలో జైనథ్ మండలంలో సాత్నాల, తాంసి మండలంలో మత్తడివాగు మధ్య తరహా ప్రాజెక్టులున్నాయి. మూడున్నర దశాబ్దాల క్రితం ఏర్పడిన సాత్నాల ద్వారా ఇంకా పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందడం లేదు. స్వరాష్ట్రంలో ఈ ప్రాజెక్టు కింద కాలువలకు సీసీ లైనింగ్ చేపట్టడం, లక్ష్మీపూర్ బాలెన్సింగ్ సీసీ లైనింగ్‌తో ఆయకట్టు కొంత మేర పెరిగింది. గతంలో సుమారు 5వేల ఎకరాల వరకే నీరందే పరిస్థితులుండగా ప్రస్తుతం ఇది 18వేల ఎకరాలకు చేరుకుంది. అయితే 24వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యాన్ని ఇప్పటికీ చేరుకోలేక పోవడం గమనార్హం. ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 8,500 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, కుడికాలువ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం. లోయర్ పెన్‌గంగ కింద జిల్లాలో జైనథ్ మండలం కొరటా, మహారాష్ట్ర వైపు చనాఖా వద్ద బ్యారేజీ నిర్మాణానికి స్వరాష్ట్రంలో అంకురార్పణ జరిగింది. సుమారు రూ.2వేల కోట్లతో నిర్మిస్తున్న ఈ బ్యారేజీ పనులు తుది దశకు చేరుకున్నాయి. రెండేళ్లుగా దీని ద్వారా నీళ్లు ఎత్తిపోస్తామని చెబుతున్నా ఇప్పటికీ సాకారం కాలేదు. 51వేల ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో దీన్ని నిర్మిస్తున్నారు. ఇక నేరడిగొండ మండలం కుప్టి వద్ద రూ.1100 కోట్ల అంచనాతో ప్రాజెక్టు నిర్మించాలని యోచించినా అడుగు కూడా ముందుకు పడలేదు.

మెరుగైన వైద్య సేవలు..

పూర్వ ఆదిలాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రిని 2008లో రిమ్స్ వైద్య కళాశాల, ఆస్పత్రిగా ఉన్నతీకరించారు. ఆ తర్వాత స్వరాష్ట్రంలో కేంద్ర, రాష్ట్రాలు సంయుక్తంగా రూ.150 కోట్లతో రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు. రూ.11.65 కోట్లతో ఎంఆర్ఐ పరికరాన్ని ఇందులో ఏర్పాటు చేశారు. త్వరలో దీనిని ప్రారంభించనున్నారు. డయాలసిస్ యూనిట్, సిటిస్కాన్, సెల్‌కౌంటర్, ఆటోమెటిక్ బయో కెమిస్ట్రీ అనలైజర్, ఆధునాతన వసతులతో కూడిన రెస్పిరేటర్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్, స్కానింగ్ యంత్రాల ద్వారా పేద రోగులకు సేవలందుతున్నాయి. పిల్లలు, మహిళల ప్రత్యేక వార్డులను ఆధునీకరించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో కార్డియాలజీ, న్యూరో, యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, పీడియాట్రిక్ సర్జరీ వంటి సేవలను అందుబాటులోకి తీసుకవచ్చేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. రిమ్స్ ఆవరణలోనే టి–హబ్ నిర్మించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల నుంచి రక్త నమూనాలు సేకరించి ఇక్కడికి చేర్చి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

పల్లె రహదారులు అంతంతే..!

జిల్లాలో అత్యధికంగా గిరిజనులు నివసిస్తారు. అనేక ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయి. ఈ మారుమూల ప్రాంతాలు ఇప్పటికీ సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి. గ్రామాల వరకు వాహనాలు చేరుకోని పరిస్థితి ఉండడంతో అత్యవసర సమయాల్లో గర్భిణులు మృత్యువాత పడుతున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. వర్షాకాలంలో మారుమూల ప్రాంతాల్లో వాగులు ఉప్పొంగి ఎన్నో గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఈ పదేళ్లలో పెద్దగా మార్పులు లేవు.

స్వరాష్ట్రంలోనే సాగుకు పెద్దపీట

• అన్నదాతకు సమకూరిన వసతులు • పదేళ్లలో తగ్గిన రైతు ఆత్మహత్యలు
• పెట్టుబడి సాయంతో పెరిగిన ఆత్మగౌరవం
• 'సాక్షి' ఇంటర్వ్యూలో వ్యవసాయశాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ సి.నర్సింగ్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయానికి మంచి రోజులొచ్చాయి. అన్నదాత మోములో చిరునవ్వులు విరిశాయి. గతంలో ఒక పంట మాత్రమే వేసే రైతన్న ప్రస్తుతం రెండు, మూడు పంటలు తీస్తుండడమే నిదర్శనం. కరువు రక్కసికి అప్పులు తోడవడంతో నాడు బలవన్మరణాలు నిత్యకృత్యమే. ప్రస్తుతం అవి గణనీయంగా తగ్గిపోయాయి. సాగునీరు, ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతుబంధు, ప్రాజెక్టుల నిర్మాణాలు, క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల నియామకాలతో అన్నదాతలో భరోసా ఏర్పడింది. సాగు విస్తీర్ణం క్రమంగా పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ ప్రస్తుతం ఆ పరిస్థితి నుంచి క్రమంగా మెరుగవుతోంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యవసాయ స్థితిగతుల్లో వచ్చిన మార్పులపై వ్యవసాయ శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ సి.నర్సింగ్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ నిర్వహించింది. – ఆదిలాబాద్‌టౌన్

10 వసంతాల తెలంగాణ



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ సి.నర్సింగ్

సాక్షి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లలో జిల్లాలో సాగు పరిస్థితి ..

నర్సింగ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాకు అన్యాయం జరిగిందనే చెప్పవచ్చు. వ్యవసాయ నిధులు పూర్తిస్థాయిలో సమకూరేవి కాదు. బడ్జెట్ 23 జిల్లాలకు పంచగా, మన జిల్లాకు అరకొరగానే వచ్చేవి. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మండలానికి ఒక ఏవో, క్లస్టర్‌కు ఒక ఏఈవో నియామకాలు జరిగాయి. అన్నదాతకు సంక్షేమ పథకాలు చేరువవడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన సలహాలు, సూచనలు అందడంతో సాగు విస్తీర్ణం 30 శాతం వరకు పెరిగింది. అలాగే కొరటా–చనాఖా ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో 50వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతులు తమకు అనుకూలమైన పంటలు పండించే వీలుంటుంది. కుప్టి ప్రాజెక్టు చేపడితే మరింత మేలు జరిగే అవకాశం ఉంటుంది.

సాక్షి: సాగునీటి ఆధారంగా వ్యవసాయ పరిస్థితి ఏ మేరకు మెరుగుపడింది..

నర్సింగ్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేవలం వర్షాధారంపైనే ఆధారపడి రైతులు పంటలు సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే అన్నదాతకు నష్టాలే మిగిలేవి. స్వరాష్ట్ర కల సాకారం అయిన తర్వాత చెరువులు, ప్రాజెక్టు, కెనాళ్ల ద్వారా సాగు నీరు అందే పరిస్థితులు మెరుగుపడ్డాయి. 24 గంటల ఉచిత విద్యుత్‌తో దాదాపు రైతులు మూడు పంటలు పండిస్తున్నారు. గతంలో కేవలం రాత్రి వేళలో మాత్రమే కరెంటు సరఫరా ఉండడంతో అప్పట్లో విద్యుత్ షాక్‌కు గురై మరణించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా దూరమైంది.

సాక్షి: పథకాలతో అన్నదాతకు ఏవిధంగా మేలు చేకూరింది..

నర్సింగ్: గతంలో రైతుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. పంట సాగు చేయాలంటే పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించే వారు. కొంత మంది బ్యాంకులను ఆశ్రయించినా పూర్తిస్థాయిలో రుణాలు అందేవి కావు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్‌కు తీసుకెళితే గిట్టుబాటు ధర కూడా లభించేది కాదు. అయితే ప్రస్తుతం రైతులు పండించిన పంటను ప్రభుత్వాలే కొనుగోలు చేస్తున్నాయి. మద్దతు ధర చెల్లిస్తుండడం, పెట్టుబడి సాయం ఇవ్వడంతో పాటు బ్యాంకు రుణాలను విరివిగా అందిస్తోంది. దీంతో అన్నదాతలో ఆత్మగౌరవం పెరిగింది.

సాక్షి: రైతు బలవన్మరణాల పరిస్థితి ఎలాఉంది..

నర్సింగ్: గతంలో అప్పుల బాధతో రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడేవారు. పంటలు పండక, అతివృష్టి, అనావృష్టితో కారణంగా నష్టపోయేవారు. రైతుబంధు, రైతుబీమా, యాంత్రికరణలో భాగంగా ట్రాక్టర్లను పంపిణీ చేశారు. దీంతో కూలీల కొరత తీరింది. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తుండడంతో పంట దిగుబడులూ పెరిగాయి. రైతు ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

సాక్షి: విత్తనాలు, ఎరువుల సరఫరాఎలా ఉంది..

నర్సింగ్: గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలంటే షాపుల ఎదుట బారులు తీరేవారు. చెప్పులు క్యూలైన్‌లో పెట్టి తమవంతు కోసం ఎదురుచూసిన పరిస్థితి. రాష్ట్రం ఏర్పాటయ్యాక సులువుగా విత్తనాలు, ఎరువులు లభించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. దీంతోపాటు ఎలాంటి ఎరువులు, విత్తనాలు ఎంత మోతాదులో వినియోగించాలన్నది ఏఈవోలు రైతు వేదికల ద్వారా అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. భూసార పరీక్షలు చేసి నేల స్వభావం, అందులో పండించాల్సిన పంటలను వివరిస్తున్నారు.

రైతులకు అందుబాటులో పత్తి విత్తనాలు

• కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో డిమాండ్ రకం పత్తి విత్తనాలను జూన్ రెండు నుంచి రైతులకు అందుబాటులో ఉంచుతామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రతీ మండల కేంద్రంలోనే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలోని పలు పత్తి విత్తన దు కాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రి జిస్టర్లు తనిఖీ చేసి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రయవిక్రయాలు పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధి కారులకు సూచించారు. అనంతరం గోదాంలను సందర్శించి అక్కడున్న నిల్వలను పరిశీలించారు. డీలర్లు కూడా వారి సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డి మాండ్ రకం పత్తి విత్తనాలను గతేడాదితో పోల్చితే ఎక్కువ ప్యాకెట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లక్ష 50 వేల ప్యాకెట్లను సంబంధిత కంపెనీ నుంచి తెప్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రైతులు 60వేల ప్యాకెట్లు కొనుగోళు చేశారన్నారు.



గోదాంలోని విత్తన నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఈనెల 2నుంచి మరో 90 వేల ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. దశల వారీగా స్టాకు వస్తుందని, రైతులందరికీ కోరిన విత్తనాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతించిన వేరే కంపెనీల విత్తనాలు కూడా కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్‌కుమార్, ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

కలెక్టర్‌కు అగ్రోడీలర్ల వినతి
అగ్రో చిన్న డీలర్లు కలెక్టర్ రాజర్షి షాను కలిసి తమ సమస్యలను విన్నవించారు. పెద్ద వ్యాపారులు బ్లాక్ మార్కెట్‌కు తరలించేలా ముందస్తుగా కంపెనీల నుంచి స్టాక్ తెప్పించుకున్నారన్నారు. ఆ కారణంగా చిన్న షాపులకు విత్తనాలు దొరకడం లేదని వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.

పనులు వేగవంతం చేయాలి
జైనథ్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పడుతున్న అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. తొలుత లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. జెడ్పీ పాఠశాలలో ఫ్లోరింగ్, తదితర పనుల కోసం రూ.5 లక్షల నిధులు కావాలని ప్రధానోపాధ్యాయుడు లస్మన్న కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం గ్రోమోర్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏవో వివేక్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్యాంసుందర్ తదితరులున్నారు.

'దశాబ్ది'కి సిద్ధం

• కలెక్టరేట్‌లో నేడు రాష్ట్ర అవతరణ వేడుకలు
• జాతీయ పతాకం ఆవిష్కరించనున్న కలెక్టర్
• ఎన్నికల కోడ్ నేపథ్యంలో సాదాసీదాగానే..

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లోని ర్వహించాల్సిన వేడుకలను కలెక్టరేట్‌లో సాదాసీదాగా చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని వేదికతో పాటు అమరవీరుల స్తూపాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కలెక్టరేట్‌తోపాటు ప్రధాన చౌక్‌లను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా షామియానాలు ఏర్పాటు చేశారు.



అవతరణ వేడుకలకు సిద్ధమైన కలెక్టరేట్‌లోని వేదిక



కలెక్టరేట్ ప్రాంగణంలోని అమరవీరుల స్తూపం

వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కూర్చునేందుకు వీలుగా కుర్చీలను సిద్ధం చేశారు. ఉదయం 9గంటలకు నిర్వహించనున్న వేడుకలకు కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించనున్నారు. అనంతరం అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. జిల్లా ప్రజలనుద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. అలాగే ఎమ్మెల్యేలు, మున్సిపల్, డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్లు తమ తమ కార్యాలయాల్లో నిర్వహించనున్న వేడుకల్లో పాల్గొని మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఆయా శాఖాధిపతులు జాతీయ జెండా ఎగురవేయనున్నారు.

క్లుప్తంగా

ఎల్లమ్మ ఆలయంలో చోరీ


జాగిలంతో పరిశీలిస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఉదయం ఆలయానికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు. అంతేకాకుండా అమ్మవారి మంగళసూత్రం, మెట్టెలు, గిరుట్లు నగలు ఎత్తుకెళ్లినట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో డాగ్‌స్క్వాడ్‌తో ఆలయ పరిసరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై సందీప్ తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు


గుడుంబా స్థావరం వద్ద అధికారులు

ఖానాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఎంఏ రజాక్ ఆధ్వర్యంలో మండలంలోని గోసంపల్లె, బీర్నంది, సత్తనపల్లి, ఎక్బాల్‌పూర్, కొమ్ముతండా గ్రామాల్లో దాడులు నిర్వహించి 2,600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 6 కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ హుస్సేన్, నిర్మల్ ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు, డీటీఎఫ్ ఎస్సై సింధు, భైంసా ఎస్సై నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధం


వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఐ లక్ష్మణ్

ఇంద్రవెల్లి: మండలంలోని అంజి గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండిళ్లు దగ్ధమయ్యాయి. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గారులే రాజేశ్వర్, గారులే శివాజీ ఇళ్లలో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు మంటలు ఆర్పివేశారు. ఘటనలో నిత్యావసర సరుకులు, విలువైన వస్తువులు, బట్టలు, సామగ్రి కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ మెస్రం లక్ష్మణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం జరిగినట్లు నిర్ధారించారు.

ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్ బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు అప్పుగా తీసుకున్న డబ్బును వడ్డీతో కలిపి చెల్లించాలని స్థానిక న్యాయమూర్తి కే.నిరోష తీర్పునిచ్చారు. గౌతమినగర్‌కు చెందిన బిల్ల మల్లయ్య, 2015లో అదే కాలనీకి చెందిన అజ్మీర రాజేశ్‌పై రూ.28.50 లక్షల చెక్ బౌన్స్ కేసు వేశాడు. నేరం రుజువుకావడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష విధించారు.



ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు

జిల్లా	స్కూల్ అసిస్టెంట్	లాంగ్వేజ్ పండిత్	పీఈటీ	ఎస్జీటీ	స్కూల్ అసిస్టెంట్ (ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీం	62	25	02	234	03	15	341

సర్దుబాటు చదువులేనా..?

- విద్యావలంటీర్ల ఊసే లేనివైనం
- పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా కోట్లాది రూపాయలతో మధ్యాహ్నం భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇదంతా బాగానే ఉన్నా ఉపాధ్యాయ ఖాళీల భర్తీ విషయంలో స్పష్టత కొరవడుతోంది. ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాక గందరగోళంగా మారుతోంది. ఈ ఏడాది మరో పదిరోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం గతేడాది మాదిరిగానే ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో మంచిర్యాల జిల్లాలో 136 మంది ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్ పేరిట విధులు కేటాయించి సర్దుబాటు చేసింది. ఇంతవరకు రిలీవ్ చేయలేదు. మరోసారి టీచర్ల సర్దుబాటుతోనే చదువులు తప్పేలా లేదు.

చదువుకు ఆటంకం లేకుండా చర్యలు

విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చర్యలు చేపడుతాం. గతేడాది వర్క్అడ్జస్ట్‌మెంట్ కింద ఆయా పాఠశాలలకు కేటాయించిన టీచర్లను రిలీవ్ చేయలేదు. వీవీల నియామకంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే వాటి ప్రకారం చర్యలు చేపడుతాం.
– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

ఖాళీల మాటేమిటో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులపై ప్రభావం చూపకుండా ఏటా టీచర్ల సర్దుబాటు చేస్తున్నారు. ఎస్ఏల బదిలీలు అయినా రిలీవ్ కాకపోవడం.. పీజీహెచ్ఎంలుగా పదోన్నతులు పొంది వెళ్లిపోయిన స్థానంలో ఖాళీలు మిగిలిపోయాయి. వివిధ కారణాలతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో బయోసైన్స్, సోషల్, హిందీ టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీలు ఎక్కువగా ఉండగా 136 మంది ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేస్తే మిగిలిన ఖాళీలపై తేల్చాల్సి ఉంది.

వీవీల ఊసేది..

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో విద్యావలంటీర్ల (వీవీ) నియామకం ఉంటుందా అనే చర్చ సాగుతోంది. 2019–20 విద్యా సంవత్సరంలో చివరిసారిగా జిల్లాలో విద్యావలంటీర్లు సేవలందించారు. తర్వాత కరోనాతో రెండేళ్లు మూతబడడం... ఆతర్వాత కాలంలో ప్రభుత్వం వారి నియామకంపై దృష్టి సారించలేదు. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో కొన్నిచోట్ల ఒకరి నుంచి ఇద్దరు ఉపాధ్యాయులతో సర్దుబాటు చేశారు. 89 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో వీవీలు లేకపోవడంతో టీచర్లు పడుతున్న బాధలు వర్ణనాతీతం. దీంతో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్న పాఠశాలల్లో సరైన బోధన లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. దీని ప్రభావం ఫలితాలపై పడుతోంది. ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసే వరకు వీవీలను నియమించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఆర్టీవో అధికారుల కొరడా

- నిబంధనలు పాటించని నాలుగు బస్సులు సీజ్


ఆర్టీసీ డిపోలో సీజ్ చేసిన వాహనాలు

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్‌ను తరలించిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఓ అధికారులు కొరడా ఝులిపించారు. శనివారం వేకువ జామున ఆదిలాబాద్ పట్టణంలో రవాణ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. హైదరాబాద్ నుంచి గూడ్స్‌తో ఆదిలాబాద్ పట్టణానికి వస్తున్న మూడు బస్సులతో పాటు ధృవీకరణ పత్రాలు లేని మరో బస్సును సీజ్ చేసినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎండికే, ముస్కాన్, మెట్రో బస్సులను సీజ్ చేసి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోకు తరలించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ప్రయాణికులతో పాటు గూడ్స్ తీసుకురావడం నిబంధనలకు విరుద్ధమన్నారు. అలాంటి బస్సులపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పత్తి విత్తనాలు అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు భోరజ్ చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం బస్సుల యజమానులను కార్యాలయానికి పిలిపించి గూడ్స్ తీసుకురాకుండా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన వెంట ఎంవీఐ మహేష్, తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి


ఫంక్షన్ హాల్ యజమానికి నోటీస్ ఇస్తున్న ఎంపీవో, ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్(జి): ఫంక్షన్ హాల్స్‌లో జరిగే శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ ప్లేట్స్ వాడకూడదని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ఎంపీవో, ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. శనివారం ఫంక్షన్ హాల్స్ యజమానులకు గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ వస్తువులు వాడితే 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైన్‌షాప్‌కు రూ.500 జరిమానా

మండల కేంద్రంలోని సీలిమా వైన్ షాప్ చుట్టుపక్కల ప్లాస్టిక్ గ్లాసులు, చెత్తాచెదారం కనిపించడంతో రూ.500 జరిమానా విధించినట్లు ఎంపీఓ, ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పరిశుభ్రత పాటించాలని వైన్‌షాప్ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి వీణరెడ్డి, తదితరులు ఉన్నారు.

నిందితులకు శిక్ష పడేనా..!

- అలేఖ్య హత్య కేసులో ముందుకు సాగని దర్యాప్తు
- 100 రోజులు దాటినా బాధితురాలికి దక్కని న్యాయం
- ఊసేలేని ఫాస్ట్ ట్రాక్ కోర్టు


అలేఖ్య (ఫైల్)


ఖానాపూర్‌లో హత్యకు గురైన అలేఖ్య (ఫైల్)

ఖానాపూర్: పట్టపగలే నడిరోడ్డుపై ప్రేమోన్మాది దాడిలో మృతి చెందిన అలేఖ్య హత్య కేసు నిందితులకు ఇప్పటి వరకు శిక్ష ఖరారు కాలేదు. హత్య జరిగి 100 రోజులు దాటినా కేసు ముందుకు సాగడం లేదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి బాధితురాలికి న్యాయం చేస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటిమూటలయ్యాయి. సాక్షాత్తూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఈ హత్య కేసు విషయమై ఆరా తీసినప్పటికీ ఎలాంటి ఫలితం కానరావడం లేదు.

పట్టపగలే దారుణ హత్య..

అలేఖ్యను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడు శ్రీకాంత్ పట్టపగలే నడి రోడ్డుపై నరికి దారుణంగా హత్య చేశాడు. ఫిబ్రవరి 8న జరిగిన ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

నేతల హడావుడి..

అలేఖ్య హత్య జరిగిన తర్వాత పెద్దసంఖ్యలో పాలక, ప్రతిపక్ష నేతలు, ప్రజా సంఘాల నాయకులు బాధిత కుటుంబానికి మద్దతు తెలిపి వెంటనే నిందితుడికి శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కానీ ఆ తర్వాత కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

అలేఖ్య హత్య కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తేనే బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని గతంలో సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. గతంలోనూ టేకు లక్ష్మిపై లైంగిక దాడి కేసులో ఫాస్ట్ ట్రాక్‌కోర్టు ఏర్పాటు చేయడంతో నిందితులకు వేగవంతంగా శిక్షలు ఖరారయ్యాయి. ఈ కేసులోనూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తేనే అలేఖ్యకు న్యాయం జరిగే అవకాశం ఉంది.

బిక్కుబిక్కుమంటున్న కుటుంబ సభ్యులు

అలేఖ్య హత్య జరిగిన తర్వాత బాధిత కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. నిందితుల నుంచి తమకు ప్రాణహాని సైతం ఉందంటూ పలుమార్లు ఎమ్మెల్యే, పోలీసులకు విన్నవించారు. నిందితులకు వెంటనే కఠిన శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బాసరలో కాలిన మృతదేహం లభ్యం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

ముధోల్: బాసర మండల కేంద్రంలో శనివారం కాలిన మృతదేహం లభ్యమైంది. రైల్వేస్టేషన్ సమీపంలో జియోటవర్ వద్ద ముళ్లపొదల్లో పూర్తిగా గుర్తుపట్టని స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ కాంతిలాల్, ముధోల్ సీఐ మల్లేశ్, బాసర ఎస్సై గణేశ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులతో దర్యాప్తు జరిపించి ఇందుకు కారణమైన నిందితులను త్వరలోనే పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని ఏఎస్పీ తెలిపారు.

ఆర్ఎంపీలపై ఎఫ్ఐఆర్ నమోదు

- నిబంధనలు అతిక్రమణ..
- మోతాదుకు మించి మందులు..
- పరిశీలనల్లో దొరికిన వారిపై కేసులు
- ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ తనిఖీల ఎఫెక్ట్

నిర్మల్: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న దవాఖానాలు, అర్హతలు లేకున్నా చేస్తున్న చికిత్సలు, ప్రజారోగ్యంతో ఆడుకుంటున్న తీరుపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ), తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఇటీవల సీరియస్‌గా స్పందిస్తున్నాయి. ఈక్రమంలోనే గత నెల 16న జిల్లా కేంద్రంలో చేసిన తనిఖీలు, బయటపడిన ఘటనల నేపథ్యంలో పదిమంది ఆర్ఎంపీలపై పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం సంచలనంగా మారింది. పలు ఆర్ఎంపీ, పీఎంపీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, పలు ఆస్పత్రులను ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేశాయి. ఇందులో పలు ఆందోళనకర విషయాలు వెలుగులోకి రావడంతో వారు సీరియస్‌గా తీసుకున్నారు.

మోతాదుకు మించి మందులు..

తమ తనిఖీల్లో అర్హతలు లేకున్నా.. వైద్యం చేస్తుండటం, మోతాదుకు మించి మందులు ఇస్తుండటం వైద్యాధికారుల బృందాలు గుర్తించాయి. అంతేకాకుండా ఆర్ఎంపీలు, పీఎంపీలు ఏకంగా యాంటీబయాటిక్స్, స్టిరాయిడ్స్‌నూ పేషంట్లకు ఇస్తున్న తీరుపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. అవసరం లేకున్నా ప్రిస్క్రిప్షన్ ఇస్తున్న వారిని గుర్తించారు. ఇక వైద్యం పేరుతో పెద్దాస్పత్రులకు సిఫార్సులు చేస్తున్నారని, అక్కడ అన్నిరకాల పరీక్షలు, ఆపరేషన్లు చేయించడంతో పాటు కమీషన్లు తీసుకుంటున్న విషయాన్నీ గుర్తించారు. ఆర్ఎంపీ, పీఎంపీలకు ఉన్న నిబంధనలకు విరుద్ధంగా వైద్యం చేయడమే కాకుండా ఆస్పత్రులు, మెడికల్‌లను మెయింటైన్ చేయడంపై వైద్యాధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఎఫ్ఐఆర్ నమోదు..

ఈనెల 16న జిల్లా కేంద్రంలో తనిఖీలు చేసినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా చికిత్స చేస్తున్న ఆర్ఎంపీలపై ఎన్ఎంసీ, టీఎస్ఎంసీ బృందం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు నిర్మల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్ఎంపీల యాజమాన్యంలో నడుస్తున్న రెండు ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వడంతో పాటు మొత్తం పదిమంది ఆర్ఎంపీలపై ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రజారోగ్యం విషయంలో నిబంధనల అతిక్రమణను సహించేది లేదని, తమ తనిఖీలు కొనసాగుతాయని వైద్యాధికారులు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- కేవీకే ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్ కుమార్


రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: సాగులో యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. పత్తి సాగులో అధిక సాంద్రతపై కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ఎరువులు, మందుల వాడకంపై రైతులకు వివరించారు. వాతావరణ పరిస్థితులు, తగ్గుతున్న దిగుబడులను పెంచేలా నాగ్‌పూర్‌కు చెందిన సీఐసీఆర్ ఆధ్వర్యంలో రైతులకు వివరిస్తూ అధిక సాంద్రత సాగు వైపు దృష్టి సారించేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 230 ఎకరాలను ఎంపిక చేసి ఈ సాగు విధానం అమలు చేస్తున్నామన్నారు. తేలిక పాటి భూముల్లో పాత పద్ధతుల్లో 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయన్నారు. అధిక సాంద్రత విధానంలో సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. సాధారణ సాగులో 10 నుంచి 15 వేల మొక్కలు నాటుతారని, అధిక సాంద్రత విధానంలో 29 నుంచి 35 వేల వరకు మొక్కలు నాటవచ్చని తెలిపారు. రైతులు, గ్రామాలను ఎంపిక చేసి ఈ సాగు విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త సైబర్ మోసాలు

- ఇద్దరి ఖాతాల నుంచి నగదు బదిలీ చేయించుకున్న కేటుగాళ్లు
- సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసిన బాధితులు



రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండలంలో శుక్రవారం సరికొత్త సైబర్ మోసాలు వెలుగులోకి వచ్చాయి. గూగుల్ పే, ఫోన్ పే ఎంపిన్ సెట్ చేయాలని ఫోన్ చేసి ఒకరి ఖాతా నుంచి, ఓటీపీ పంపించి మరొకరి ఖాతా నుంచి కేటుగాళ్లు నగదు బదిలీ చేయించుకున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన పిట్టల సునీత భర్త ప్రభాకర్‌తో కలిసి మిర్చి బండి నడుపుతోంది. 8 నెలలుగా మిర్చి బండి ద్వారా వచ్చిన డబ్బుల నుంచి రోజుకు కొంత మొత్తంగా రూ.50వేల నగదును తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. శుక్రవారం సుమారు 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. 'మీ ఫోన్‌పే, గూగుల్ పే పిన్ ఎక్స్‌పైర్ అయిందని, వెంటనే సెట్ చేయకపోతే బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అవుతుంది' అని హెచ్చరించాడు. మొబైల్‌కు వచ్చే ఓటీపీతోపాటు గూగుల్‌పే, ఫోన్‌పేల ప్రస్తుత ఎంపిన్‌లు చెప్పాలని కోరగా.. ప్రభాకర్ చెప్పేందుకు నిరాకరించాడు. 'ఏ సమస్య ఉన్నా బ్యాంకుకు వెళ్లి పరిష్కరించుకుంటా' అని ఫోన్‌లో చెబుతుండగానే సునీత బ్యాంకు ఖాతాకు గుర్తు తెలియని అకౌంట్ నుంచి రూ.1 క్రెడిట్ అయింది. వెంటనే ప్రభాకర్ టీజీబీకి వెళ్లి విషయాన్ని బ్యాంకు అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఓటీపీలు, ఎంపిన్‌లు ఎవరికీ చెప్పొద్దని, ఏ సమస్య ఉండదని వారు చెప్పడంతో ఇంటికి చేరుకున్నాడు. కొద్దిసేపయ్యాక ఫోన్ పే తెరవగానే మొదట రూ.25వేలు, మరో రెండు నిమిషాలకు మరో రూ.25వేలు బ్యాంకు ఖాతా నుంచి విత్‌డ్రా అయినట్లు మొబైల్‌కు సందేశం వచ్చింది. మళ్లీ బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా.. మహారాష్ట్రకు చెందిన ఖాతాకు రెండు దఫాల్లో రూ.50 వేలు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సైబర్ క్రైం పోలీసుకు ఫిర్యాదు చేశాడు. ఎనిమిది నెలలపాటు కష్టపడి దాచుకున్న డబ్బులు సైబర్ నేరగాళ్లు ఒక్క నిమిషంలో ఊడ్చుకెళ్లటంతో భార్యభర్తలిద్దరూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మరోవైపు మండలంలోని నవేగాంకు చెందిన వడాయి హన్మంతురావు మండల సమాఖ్యలో సీసీగా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఫోన్‌పే ఓపెన్ చేయగానే ఆయన ఫోన్‌కు ఓటీపీ వచ్చింది. అనుమానం వచ్చి శనివారం ఉదయం రెబ్బెన తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు వెళ్లి ఖాతాను పరిశీలించగా.. ఖాతా నుంచి రూ.7700 మాయమయ్యాయి. మండల కేంద్రానికి చెందిన పిట్టల సునీత బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు లూటీ చేసిన విధంగానే రెంట్ పేరుతో హన్మంతురావు బ్యాంకు ఖాతా నుంచి మహారాష్ట్రకు చెందిన బ్యాంకు ఖాతాకు ఐఎంపీఎస్ పద్ధతిలో సైబర్ నేరగాళ్లు నగదు బదిలీ చేశారు. 1930 నంబర్‌కు ఫోన్ చేసి హైదరాబాద్‌లోని సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి

భీమారం: మండల కేంద్రానికి చెందిన మాటేటి లక్ష్మి(80) శుక్రవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందింది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఒక్కసారిగా కింద పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ వద్ద అర్కిల సంపత్ (45) శనివారం వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. శ్రీరాంపూర్‌కు చెందిన సంపత్ భీమారంలో ఉన్న అతని స్నేహితుడైన మదుసూధన్ దగ్గరకి వచ్చాడు. అలసటగా ఉందని చెప్పి పంక్చర్ షాపు పక్కనే పడుకుని మృతి చెందాడు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భార్య కాపురానికి రావడంలేదని ఒకరు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల మేరకు హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన ఎంబడి వెంకటేష్ (35)కు నంనూర్ గ్రామానికి చెందిన జ్యోతితో ఆరేళ్ల క్రితం వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేష్ ఇటీవల మద్యానికి బానిస కావడంతో ఇంట్లో తరచూ గొడవలు జరిగాయి. దీంతో జ్యోతి ఇటీవల పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుని సోదరుడు అంజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అటవీ అధికారుల అడ్డగింత

కాగజ్‌నగర్ రూరల్: అంకుసాపూర్ గ్రామ శివారులోని పోడు భూములను శనివారం సర్వే చేసేందుకు వెళ్లిన అటవీశాఖ అధికారులను పోడు రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో రమాదేవి మాట్లాడుతూ పోడు భూములకు సంబంధించిన పట్టాల విషయంలో సర్వే చేస్తున్నామని, పోడు రైతులు సహకరించాలని కోరారు. పలువురు రైతులు మాట్లాడుతూ భూములకు సంబంధించి తమ వద్ద పట్టాలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులు సర్వేలు చేసి పట్టాలు ఇచ్చినట్లు వివరించారు.

భార్యను గొడ్డలితో కొట్టిచంపిన భర్త

- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు


మరోని మృతదేహం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

కాసిపేట: క్షణికావేశంలో భార్యను గొడ్డలితో కొట్టి చంపిన సంఘటన మండలంలోని మామిడిగూడలో చోటు చేసుకుంది. శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మామిడిగూడకు చెందిన నగావత్ దేలు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతని భార్య నగావత్ మరోని (60)తో తరచూ గొడవపడేవాడు. గత నెల 31న రాత్రి మద్యం మత్తులో ఆమెతో గొడవకు దిగాడు. క్షణికావేశంలో గొడ్డలితో కొట్టడంతో ప్రాణాలు కోల్పోయింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.